నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
18వ వసంతం
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,11 నవంబర్ 2024 | 8 పేజీలు

# నేడు కొత్తపల్లి నర్సాపురం రాక

**- స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు**



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** కాపుకార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సోమవారం నరసాపురం రానున్నారు. మధ్యాహ్నం నీటి పారుదల శాఖ గెస్ట్‌హౌస్ సమీపంలో ఆయనకు స్వాగతం పలికేందుకు అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి అభిమానులు హాజరై బైక్ ర్యాలీ ద్వారా సుబ్బారాయుడుని నివాసానికి తీసుకెళ్లే ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకొల్లు రోడ్డు నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా మెయిన్ రోడ్డు, మిషన్ హై స్కూల్ రోడ్డు మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఆయన అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. గత కొంతకాలంగా సుబ్బారాయుడు పదవి లేకుండా ఉన్నారు. శనివారం కూటమి ప్రభుత్వం కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవిస్తూ ప్రకటన విడుదల చేసింది. దీంతో ఆయన

- తరువాయి 2లో..

## వైసిపి క్రియాశీలక రాజకీయాల్లో మాజీ ఎంపీ కోటగిరి?



**ఏలూరు,సూర్యబ్యూరో** : ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగనున్నారా? ఆంధ్రప్రదేశ్ రాజకీయ రంగచరిత్రలో ఇక 'కోటగిరి' అనే పేరు తెరమరుగవుతుందా?అని మాజీ మంత్రి, రాజకీయ దిగ్గజం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన కోటగిరి విద్యాధరరావు అనుచరులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మాజీ ఎంపీ,కోటగిరి విద్యాధరరావు తనయుడు కోటగిరి శ్రీధర్ మళ్లీ వైసీపీ క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగనున్నట్టు పలువురు ఆపార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. 2019లో ఏలూరు ఎంపీగా గెలిచిన ఆయన 2024 ఎన్నికల్లో పోటీ చేయకుండా స్తబ్దంగా ఉన్నారు.అయితే పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక కోటగిరి శ్రీధర్ రాజకీయాల్లో కొనసాగరని, విదేశాల్లో ఉంటారని ఆపార్టీ నాయకులతో పాటు కోటగిరి అనుచరులు, అభిమానులు భావించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రత్యేకించి ఏలూరుజిల్లాలో అటు వైసీపీలో, ఇటు పార్టీలకతీతంగా కూడా బలమైన ముద్ర వేసుకున్న కోటగిరి శ్రీధర్ ఐదేళ్లకే రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టారా? అని రాజకీయ వర్గాల్లో చర్చినియాంశమైన తరుణంలో ఇటీవల శ్రీధర్ స్వగ్రామమైన తూర్పు ఎడవల్లిలో వనభోజనాల పేరుతో నిర్వహించిన కలయికతో వైయస్సార్సీపీలో, కోటగిరి అనుచరుల్లో నూతన కదలిక కనిపించింది. ఈవనభోజనాల కార్యక్రమానికివైసిపి ప్రస్తుత జిల్లా అధ్యక్షులు, కైకలూరు మాజీ శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు (డిఎన్ఆర్), ఏలూరు పార్లమెంటు ఇన్చార్జి కారుమూరి సునీల్ కుమార్‌తో పాటు ఏలూరు జిల్లాలోని ఏడుగురు నియోజకవర్గ ఇన్చార్జిలు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో విశేషంగా చర్చినీయాంశం అయింది. ఈ కార్యక్రమానికి మామిళ్ళపల్లి జయప్రకాష్(ఏలూరు),కొఠారు అబ్బయ్య చౌదరి(దెందులూరు),కంభంవిజయరాజు(చింతలపూడి),తెల్లం బాలరాజు (పోలవరం), మేక ప్రతాప్ వెంకట అప్పారావు( నూజివీడు), పుప్పాల వాసు బాబు( ఉంగుటూరు) తదితర ముఖ్యనేతలు అంతా హాజరయ్యారు. దీనితో కోటగిరి శ్రీధర్ నిర్వహించిన వనభోజనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ఆయనను పార్టీఅధిష్టానం క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగాలని కోరినట్లు సమాచారం.అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారని కూడా తెలుస్తోంది.

అందుకే వనభోజనాల కార్యక్రమానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలను ఆహ్వానించి ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అయితే ఇంకా ఈవిషయంలో స్పష్టత రావాల్సి ఉంది.అటు వైసిపి అధిష్టానం కాని, ఇటు కోటగిరి శ్రీధర్ గాని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.అయితే ఇటీవల జరిగిన కలయికతో అటు కోటగిరి అభిమానుల్లో, అనుచరుల్లో, ఇటు వైసిపి నాయకులు, శ్రేణుల్లో ఆసక్తి కర చర్చ వినిపిస్తోంది.



## ప్రభుత్వం నిర్దేశించిన ధరలనే ఇసుక విక్రయాలు

**- తీపర్రులో టన్ను రూ.96.02, ఔరంగాబాద్‌లో రూ.229 - రవాణా చార్జీలు అదనం**

**భీమవరం,మేజర్‌న్యూస్:** ఇసుక వినియోగదారుడు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఉచిత ఇసుకను పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.జిల్లాలో ఇసుక అందుబాటులో లేనందున తూర్పుగోదావరి జిల్లా తిపర్రు -2అండ్3, ఔరంగాబాద్ రీచ్‌ల ద్వారా ఇసుకను పొందేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వినియోగదారుడు ఉచిత ఇసుకను పొందుటకు ఇసుక వెలికితీత,లోడింగ్,అంతర్గత రవాణా,అన్లోడింగ్, ఇసుక రీచ్‌ల నిర్వహణ చార్జీలు, జీఎస్టీతో కలిపి టన్ను ఒక్కంటికి తిపర్రులో రూ.96.02, ఔరంగాబాద్‌లో రూ.229 చెల్లించాల్సి ఉందని,దీనికి రవాణా చార్జీలు అదనం అన్నారు. ఇప్పటికే ఫలు దఫాలుగా ట్రాన్స్పోర్ట్‌తో చర్చించి

- తరువాయి 2లో..



## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభా మందిర ప్రారంభం

**– పాల్గొన్న కేంద్రమంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరంలోని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ రెండో అంతస్తులో నిర్మించిన సభా మందిర ప్రారంభోత్సవంలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. శృంగవృక్షం శ్రీదత్త పీఠం పీఠాధిపతులు శ్రీసాయి దత్త నాగనంద సరస్వతీ స్వామీజీ,టీడీపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర్రావు, పొత్తూరి బాపిరాజు, యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి రామానాయుడు



**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో పాలకొల్లు- పూలపల్లి బైపాస్ రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న రహదారి పనులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు ఆదివారం పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరమైన ఈ రహదారి గతంలో పెద్దపెద్ద గోతులతో నడవడానికి కూడావీలులేనిపరిస్థితుల్లో ఉండేదన్నారు.నేడు ఈరహదారి నిర్మాణంతో పలుప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మంత్రి రామానాయుడు తెలిపారు.



## డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌తో ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ భేటీ

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి రెడ్డి అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని జనసేనపార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ని కలిసి తనకు ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారప్రతినిధి ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి అయిన రెడ్డి అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. జనసేన పార్టీ ఆశయాలు, పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారం పదవి బాధ్యతలు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# ఆహుతులను ఆకట్టుకున్న కండల వీరుల ప్రదర్శన





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అందులో భాగంగానే ఈమధ్యకాలంలో కండలు చూపిస్తూ సిక్స్‌ప్యాక్ వచ్చేవరకు యువత వ్యాయామం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను ఆదివారం బి.వి.ఆర్ కళా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి పోటీలకు విచ్చేసిన 50మంది పాల్గొని వివిధ కేటగిరిలో తమ కండలను ప్రదర్శించారు. పలు భంగిమలలో తమ కండలను ప్రదర్శించిన తీరు ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాకేంద్ర వ్యవస్థాపకులు బుద్దాల వెంకటరామారావు, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డయాలిసిస్ థెరపిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎమ్మెల్యే అంజిబాబుకు వినతి**



**భీమవరం,మేజర్ న్యూస్:** రాష్ట్ర డయాలిసిస్ థెరపిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భీమవరం నియోజక వర్గం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు లను కలిసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ కే రహీమ్, జిల్లా అధ్యక్షులు సాకా సురేష్, కార్యవర్గం వి దినేష్, ఐ మోహన్, పి కుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. కిడ్నీలు పాడైన వారికీ 24 గంటలలో సేవలు చేస్తూ వాళ్ళ ప్రాణాలకు నిత్యం నీడలా వున్న డయాలిసిస్ థెరపిస్టుకు మాత్రం కుటుంబ పోషణకు, ఆరోగ్య భద్రతకు సరిపడేంత జీతం గాని, ఉద్యోగ భద్రత గాని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల్లో ఒక్క ఉద్యోగం కూడా లేదని, కనీసం మా సమస్యలు ఈ కూటమి ప్రభుత్వం లోనైనా నెరవేరతాయని కొండంత ఆశతో ఉన్నామని అన్నారు. రాష్ట్రంలోని డయాలిసిస్ థెరపిస్టులకు కనీస వేతనాలు, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు



**నూజివీడు,మేజర్ న్యూస్ :** డిఎస్పి కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ ఆదేశాలపై ఆదివారం నూజివీడు ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ తిరుగు చుండగా బహిరంగ ప్రదేశంలో 6 ఆరుగురు మద్యం సేవించుచుండగా అదుపులోనికి తీసుకొన్నారు.వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి వివరాలను గురించి డయల్ 112కు గాని లేదా ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 89779 17599 సమాచారం తెలిపిన వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ఓ బి ఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో 1992-1993 పదోవ తరగతి బ్యాచ్ విద్యార్థులు విరవాడ రోడ్ లో ఒక తోటలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానిచుకొని వారు చదువుకొనే రోజుల్లో గురువులతో, స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమకు చదువు చెప్పి భవిష్యత్తుకి బంగారు బాటలు వేసిన గురువులను గుర్తుపెట్టుకోవడం వారిని సత్కరించుకోవటం చాలా సంతోషంగా వుంది అని అన్నారు. అనంతరం అందరూ గురువులు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుడా ఛైర్మన్ బాబుకు ఘన స్వాగతం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కుడా ఛైర్మన్‌గా పేరు ప్రకటించిన తరువాత పెద్దాపురం పట్టణానికి విచ్చేసిన తుమ్మల రామస్వామి బాబుకు ఘన స్వాగతం లభించింది. ఆదివారం పెద్దాపురం పట్టణం గుర్రాల సెంటర్ వద్ద తుమ్మల బాబుకి పెద్దాపురం నియోజకవర్గ జనసేన శ్రేణులు స్వాగతం పలికారు. రెండో విడతలో నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీలో కష్టపడ్డ నాయకులకు, నమ్ముకున్న వాళ్ళకి ఫలితం లభించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో భారీగా నామినేటెడ్ పదవులు తీయడం జరిగింది.దీనిలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రస్తుత కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబుకి కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా పేరు ఖరారు చేయడం జరిగింది.కూడా ఛైర్మన్‌గా పేరు ఖరారు చేసిన అనంతరం పెద్దాపురం నియోజకవర్గానికి విచ్చేసిన తుమ్మల బాబుకి జనసేన నాయకులు శ్రేణులు గజమాలలు బాణసంచా కలువులతో ఘనస్వాగతం పలికారు.

పెద్దాపురం పట్టణం గుర్రాల సెంటర్ నుండి భారీ ర్యాలీగా సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మల రామస్వామి బాబు ర్యాలీ మార్గమధ్యలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ భారీ ర్యాలీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ మరియు సామర్లకోట పట్టణం కోటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు కొత్తపల్లి నర్సాపురం రాక

మొదటిపేజీ తరువాయి

అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరుస్తున్నాయి.గత రెండు రోజులుగా వ్యక్తిగత పనులపై ఆయన నరసాపురంలో లేకపోవడం, కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై మొదటిసారి నరసాపురం రావటం భారీ ఎత్తున స్వాగతం పలకాలని ఆయన అభిమానులుప్రణాళిక రూపొందించారు.

## ప్రభుత్వం నిర్దేశించిన ధరలనే ఇసుక విక్రయాలు

మొదటిపేజీ తరువాయి

వినియోగదారుడికి నష్టం లేని విధంగా రవాణా చార్జీలను నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఇసుక రవాణా వాహనం కొరకు జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్ నెంబర్లకు 93914 45753, 86682 91997, 81869 39223, 95501 75144, 80991 99883, 91820 37274 లకు ఫోన్ చేసి పొందవచ్చునని తెలిపారు. సంబంధిత వాహనంలో వినియోగదారుడు నేరుగా రీచ్ కు చేరుకుని ఆధార్ కార్డు ద్వారా ఉచిత ఇసుకను టన్ను ఒక్కింటికి నిర్దేశించిన చార్జీలను చెల్లించి పొందవచ్చునని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈఅవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

### నిధుల లేమితో అధోగతి చెందుతున్న "బోట్ క్లబ్ పార్కు"

**- బోటుషికారుతో పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలి**

**- పౌరసంక్షేమ సంఘం**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** మైసూరు బజ్జీలో మైసూర్ లేనట్టుగా నేతి బీరకాయలో నెయ్యి లేనట్టుగా కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన బోట్ క్లబ్ పార్కులో పర్యాటక బోటువిహారం లేకుండా అభివృద్ధికి తావు లేకుండా తయారయ్యిందని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. ఆదివారం ఉదయం పౌరసంఘం నాయకులు పార్కును పరిశీలించిన మేరకు అధికారులకు లేఖ వ్రాసారు. పార్కులోని చెత్తలను తరలించకుండా పర్యావరణానికి హానికరంగా దగ్గం చేయడం జరుగుతున్నదన్నారు. నీటి దుర్వినియోగం ఎక్కువగా వుందన్నారు. చెరువు పొడవునా రైలింగ్‌ను ఆనుకుని పదిహేను అడుగుల వెడల్పు వున్న బాట మార్గం అంతా చెత్తలు పొదలు తుప్పలతో నిండివుందన్నారు. పాములు పెరిగే అవకాశం ఏర్పడిందన్నారు. కరెంటు వైర్లు, కేబుల్ వైర్లు, ఫీజు బాక్సులు ఓపెన్‌గా ఉండడం వలన ప్రమాదం వాటిల్లే పరిస్థితి వుందన్నారు. పిల్లలు ఆడుకునే క్రీడా కరికరాలు అతితక్కువగా వున్నాయని వున్నవాటికి తుప్పు పట్టి శిథిలమై వృధాగా అలంకరణ ప్రాయమయ్యాయన్నారు. వెలుతురు కల్పించే విద్యుత్ దీపాలు కరువయ్యాయన్నారు. త్రాగిపడేసిన మద్యం సీసాలు అపారిశుద్ధ్యం బెడద ఎక్కువగా వుందన్నారు. శునకాల సంఖ్య అధికంగా వుందాన్నారు. తగిన సిబ్బంది లేకపోవడం వలన అజమాయిషీ కొరవడి సి సి కెమెరాల నిర్వహణ కరువయ్యి అసాంఘిక బెడద ఏర్పడిందన్నారు. రాత్రి వేళల్లో మాదకద్రవ్యాల గుడారాలు కొలువవు తున్నాయన్నారు. పార్కు బయట పలు మహనీయుల విగ్రహాల పెయింటింగ్స్ పాడయినందున వాటికి రంగులు వేయించాలన్నారు. రోడ్డు మీద రైల్వే ట్రాక్ మీద ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ తగిన రక్షణ చర్యలు వహిస్తూ బస్సులు, రైళ్లు నడుస్తున్నాయని, అదే రీతిగా బోట్ క్లబ్ చెరువులో తగిన క్రమశిక్షణ పరిరక్షణ కల్పించే చర్యలు వహించి బోటు మీద షికారు నిర్వహించే పర్యాటక ప్రగతి కల్పిస్తే స్మార్ట్ సిటీ ఖ్యాతి ఇనుమడించే అవకాశం ఉంటుందన్నారు. గత రెండేళ్లుగా ముగ్గురు ప్రత్యేక అధికారులు, ఆరుగురు కమీషనర్లు మారినా బోట్ క్లబ్ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. విలీన గ్రామాల వెతల వలన ఎన్నికలు జరగక ఆర్థిక సంఘం నిధులు రూ.20 కోట్లు స్మార్ట్ సిటీ నిధులు రూ.250 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న రూ.210కోట్లు చెత్త చార్జీల భారంతో ఏర్పడిన రూ.6.50 కోట్లు వసూలు చేయని ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను బకాయిలు రూ.62 కోట్లు కారణంగా నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి అభివృద్ధి పనులు చేయించలేకపోతున్నారన్నారు.

సిటీ ఎమ్మెల్యే రూరల్ ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ కార్పొరేషన్‌లో భాగస్వామ్యంగా వున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు విడుదల చేయించే చర్యలు తీసుకోవాలని కోరారు. బోట్ క్లబ్ పార్కును పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు, చింతపల్లి అజయ్ కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, పులి సతీష్, వెలగా భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

# పట్టణాలలో 2సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు స్థలం ఇవ్వాలి

## – సిపిఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారతకమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశం ఆర్.ఆర్. పేట,స్ఫూర్తి భవన్‌లో అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా పేద ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూమి కాకుండా పట్టణ ప్రాంతాల్లో పేదలకు 2 సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచి ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు ఇటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసేలా గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారుల నుండి అర్జీలను సేకరించి నవంబర్ 18న గ్రామ వార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించి సహకరించిన అర్జీలను ప్రభుత్వానికి ఇవ్వాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి పట్టాదారుల వివరాలను సేకరించి అర్జీలను నమోదు చేయించే కార్యక్రమం ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ ,కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిర,బళ్ల కనకదుర్గారావు,తెర్లాపు శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## 23న జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ వర్కర్స్ సమావేశం




ఏలూరు,మేజర్‌న్యూస్: ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం ఈనెల 23న జంగారెడ్డిగూడెంలో జరుగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ తెలిపారు. సమావేశం ప్రాముఖ్యతను వివరిస్తూ స్థానిక ఆర్ఆర్ పేట ఎస్ఆర్ టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో పురపాలక సంఘాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఉద్యోగ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ కార్మికులకు నెలకు 21 వేల రూపాయలు వేతనం ఇస్తున్నారని వాటర్ సప్లై,పంపులు చెరువులలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కేవలం నెలకు 15 వేల రూపాయలే వేతనం ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈనెల 23న జంగారెడ్డిగూడెంలో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా విస్తృత సమావేశానికి ఇంజనీరింగ్ విభాగంలో చేస్తున్న ఉద్యోగ సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి నారాయణరావు యూనియన్ సహాయ కార్యదర్శి ఎస్ శ్రీనివాసు తదితరులు మాట్లాడారు.

## డైమండ్స్ లయన్స్ వృద్ధులకు

# అన్నదానం



తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్: తాడేపల్లిగూడెం డైమండ్స్ సభ్యులు పేరిచర్ల ఫౌండేషన్ డైరెక్టర్ లయన్ పేరిచర్ల వీరభద్ర రాజు పుట్టినరోజు సందర్భంగా డైమండ్స్ ఆధ్వర్యంలో పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులు కు అన్నదానం జరిపారు.

లయన్ యర్రా ఆంజనేయ స్వామి లయన్ ఆకుల సతీష్ మాట్లాడుతూ డైమండ్స్ లయన్స్ పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు,చిన్నారులకు చేయూత అందిస్తున్నాం అన్నారు. ఈకార్యక్రమంలో లయన్ మధు బాబు, లయన్ బడుగు చంద్ర శేఖర్ లయన్ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

# 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




ఏలూరు,మేజర్‌న్యూస్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవా చేస్తూ 104 ఎంఎంయు ఎంప్లాయస్ యూనియన్‌గా గత 16 సంవత్సరాల నుండి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామని, మా డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు కలక్టరేట్ వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించారు. కోవిడ్ సమయంలోను ఎన్నో భయంకరమైన తుఫాను సమయంలోను ఇటీవల విజయవాడ మునిగి పోయిన సందర్భంలోను ఇలా అనేక ఎమర్జెన్సీ సమయలాలోను ఎక్కడా విశ్రామించకుండా పనిచేస్తూ ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకొని వస్తూ ఉద్యోగులు గా వ్యవస్థ గా మేము నష్టపోతూ వున్నామన్నారు. గతంలో జి.ఒ నెం.3 151 జి.ఓలు ప్రకారం ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మమ్ములను గత ప్రభుత్వం 2020 జులై 1 నుండి అరబిందో ఫార్మా ఫౌండేషన్ అనే సర్వీస్ ప్రొవైడర్‌కి ఇచ్చి మరల మమ్ములను ప్రైవేట్ కి అప్పగించి త్వరలో ఎపి సిఎఎస్‌లో మిమ్మల్ని విలీనం చేస్తాము అని హామీ ఇచ్చి మాకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని నిత్యావసరరాలు ధరలు దృష్టిలో ఉంచుకొని జి.ఓ నెంబర్ 7 ప్రకారం మాకు వేతనాలు ఇప్పించాలి అని కోరుకుంటూ వున్నాము. మా సమస్యలు పరిష్కారం కానీ యెడల తరువాత రోజుల్లో మా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

– డిమాండ్స్ –104 సర్వీస్‌లను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా నిర్వహించాలి. దీని ద్వారా అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.50వేలుతో ఈ సర్వీస్ లను నిర్వహించ వచ్చు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్,డి.ఇ. ఓ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 3సంవత్సరాల నుండి యాజమాన్యం నిర్లక్ష్యం గా వెయ్యని ఇంక్రిమెంట్ లు ఏరియార్స్ రూపంలో ఇవ్వాలి.(డిఎస్‌సి ఆర్ఒఆర్) ద్వారా నియమించబడి సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్ లను ఇతర వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతి లో నియమించాలి. అదే విదంగా 74 మంది డ్రైవర్స్ (ఆర్ఒఆర్ డిఎస్‌సి) ద్వారా నియమితులై ఎవరైతే వున్నారో వారికీ ఎప్పుడు వారికీ అర్హత వచ్చిందో అప్పటినుండి స్లాబ్ అమలు చెయ్యాలని కోరారు

## ప్రముఖ వ్యాపారవేత్త కళాబంధు వెంకటరాధా రమణ గుప్తా ఇక లేరు





**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** పాలకొల్లు పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, కళాబంధు సేవా తత్పరుడు బొండాడ వెంకట రాధా రమణ గుప్త, (90) ఆదివారం ఉదయం వయోభారంతో మృతి చెందారు, ఆయనకుఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు, మూడు సంవత్సరాల క్రితం ఆయన భార్య రాజవల్లి రత్న తాయారు కాలం చేశారు,వారి భార్య పేర పేదలకు రాజవల్లి రాధా రమణ ఐ హాస్పిటల్ స్థల దాత, రాధా రమణ గుప్త పాలకొల్లు ప్రెస్ క్లబ్ గౌరాధ్యక్షులుగా భవననిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనాన్ని నిర్మించారు, పాలకొల్లు అర్బన్ బ్యాంకు భవనానికి సహకరం అందించారు,కళల పట్ల ఎంతో మక్కువతో నాటక కళాకారులకు ఆయనకు తోచిన రీతిలో సహాయ సహకారాలు అందించేవారు, పాలకొల్లు భీమవరంలో హెచ్.పీ గ్యాస్ డీలర్‌గా చేస్తున్నారు, ఈయన మృతి పట్ల జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు,పాలకొల్లు ప్రెస్ క్లబ్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు,

## తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు



కుక్కునూర్,మేజర్ న్యూస్ : సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు,యస్ ఐ రామకృష్ణ కు వచ్చిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది కలిసి మండల కేంద్రంలోని వేలేరు గ్రామంలో దాసరి.లక్ష్మి కాంతం అనే వారి దగ్గర తెలంగాణకు చెందిన మద్యం స్వాధీ నం చేసుకున్నారు.

11 సిసాలు స్వాధీనం చేసుకోని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్‌లు విలేకరుల కు తెలియజేసారు.

## 15వ వార్డులో 'దేశం' సభ్యత్వ నమోదు



నరసాపురం,మేజర్‌న్యూస్ : పట్టణంలోని 15వ వార్డు పీచుపాలెంలో ఆదివారం తెలుగుదేశం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి పార్టీ సభ్యత్వం చురుగ్గా సాగుతుందని, నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ, పట్టణంలోని అన్ని వార్డులలో సభ్యత్వ నమోదుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జక్కం శ్రీమన్నారాయణ,కొల్లు పెద్దిరాజు పెంద్ర శ్రీనివాస్,పొన్నాల నాగబాబు, వాతాడి ఉమామహేశ్వర రావు, ముప్పిడి మార్గదర్శి, గుడాల రమేష్, బల్ల సాయి మోహన్, వన్నె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలి

## – బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలనిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.స్థానిక అన్నే భవనంలో జరిగిన రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రబీ పంటకాలానికి రైతులు ప్రీమియం చెల్లించాలని, 2019 నాటి పంటల బీమా పథకంఅమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించిందని ఆ విధంగానే ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

ప్రీమియం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారే తప్పపంట నష్టాలు జరిగిన సందర్భంలో రైతులకు బీమా పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**-రబీ సాగు నీటిపై స్పష్టమైన ప్రకటన చేయాలి –** గోదావరి, కృష్ణా డెల్టాలకు రబీ సాగునీరు విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. జిల్లాలో వరి కోతలు ప్రారంభమై రబీ సాగుకు అన్నదాతలు సమాయత్తం అవుతున్న ఈ దశలో కృష్ణా,గోదావరి డెల్టాల పరిధిలో రబీ సాగుకు సాగునీరు విడుదలపై ఎటువంటి నిర్ణయాలు జరగకపోవడంతో అన్నదాతలు అయోమయ స్థితిలో ఉన్నారని చెప్పారు. ప్రాజెక్ట్ కమిటీలసమావేశాలు నిర్వహించి సాగునీరు విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించగా సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి టోర్నమెంటుకు మేడంకి రవితేజ ఎంపిక



పెదవేగి,మేజర్న్యూస్ : ఆల్ ఇండియా ఉద్యోగ సివిల్ సర్వీస్ 2024–25 జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనెందుకు స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ నెల 6,7తేదిలలో నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో అథ్లెటిక్స్ పోటీలు,సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో బాగంగా అథ్లెటిక్స్ పురుషులు 400 మీటర్లు రన్నింగ్ విభాగంలో ఏలూరు జిల్లా ప్రభుత్వ ఉద్యోగి మేడంకి రవితేజ (ఇంజనీరింగ్ అసిస్టెంటు,పెదవేగి మండలం ,భోగాపురం (గ్రామం) ఎంపికయ్యారు. అంతేకా కుండా 9 వ తేదీన ఐజి ఎంసి స్టేడియం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ సెలెక్షన్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ మెన్ టీంకి ఎంపికయ్యారు. వీరూ జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో ఆంధ్ర ప్రదేశ్ వాలీబాల్ జట్టు తరపునా ఆడనున్నారు. ఈ సందర్భంగా భోగాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ భూపతిరాజు కృష్ణంరాజు తోటి సచివాలయం ఉద్యోగులు,మండల అభివృద్ధి అధికారి సహకారం తో జిల్లా స్థాయి నుంచీ రాష్ట్ర స్థాయి మరియు రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి కి చేరడంతో మేడంకి రవితేజకు అభినందనలు తెలియచేసారు.

## ఘనంగా అటవీ అమర వీరుల దినోత్సవం



**కుక్కునూర్,మేజర్ న్యూస్ :** కుక్కునూర్ మండల కేంద్రంలో గల ఫారెస్ట్ కార్యాలయంలో అటవీ అమర వీరుల సంస్మారన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ అధికారి కృష్ణ కుమారి మాట్లాడుతూ కీర్తి శేషులు పందిలా పల్లి శ్రీనివాస్‌రావు ఐయఫ్ యస్ అటవీ రక్షణకు ప్రాణాలు కోల్పోయిన వల్ల ఆదివారం అటవీఅమరవీరుల దినోత్సవం జరుపుకోవడం జరుగు తుందని,అలాగే రాష్ట్రములో ఇప్పటికి 23 మంది ప్రాణాలు కోల్పోయరని వారందరి ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కేసరి పెరుమాళ్ళు, సిబంది పాల్గొన్నారు

# జమిలి ఎన్నికలు భారత ఫెడరల్ వ్యవస్థకు భంగం

## – సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు ఏలూరు యాత్ర లో ఈరోజు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రవి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రాంతీయ పార్టీల మద్దతు అధికారంలో వచ్చినప్పటికీ తన మతోన్మాద ఆర్ఎస్ఎస్ విధానాన్ని ముందుకు తీసుకెళు ్తందని దుయ్యబట్టారు.తాజాగా నరేంద్ర మోడీ ఒకే దేశం ఒకే ఎన్నిక అనే పల్లవి అందుకున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ తన మూల సిద్ధాంతంలో భారతదేశంలో ఒకే మతం ఒకే భాష ఉండాలని కోరుతుందని తెలిపారు. దానిలో భాగంగానే హిందీని దేశమంతా రుద్దాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పుడు ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అమలు కావడం అంటే భారతదేశ ఫెడరల్ వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. జమిలి ఎన్నికల విధానం అమలయితే రాష్ట్రాల్లో ఉండే ప్రాంతీయ పార్టీల మొడుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని హెచ్చరించారు. కాబట్టి జమిలి ఎన్నికల విధానాన్ని రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, వైసిపి పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజా పోరు యాత్రకు సిపిఎం నగర కార్యదర్శి పి కిషోర్ నాయకత్వం వహించారు. ఆదివారం జరిగిన పోరు యాత్ర వెంకటాపురం పంచాయతీ పరిధిలో 19 డివిజన్ హనుమాన్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీనివాస్ నగర్, శ్రీ గార్డెన్స్,హరిప్రియ నగర్, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో పోరు యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఏ శ్యామల రాణి,కే లెనిన్,నగర నాయకులు వి సాయిబాబు,బి జగన్నాథరావు, వి వి ఎన్ ప్రసాద్, ఎస్ సత్యనారాయణ, జి శారద, కే నాగమణి, వి లక్ష్మీ కుమారి, ఎం గౌరీ, గంగాధర్ రావు, అల్లం వెంకటేశ్వరరావు మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నెత్తిన భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### – సిపిఎం మహా సభలో జిల్లా కార్యదర్శి బలరాం



**నరసాపురం,మేజర్న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు బాధలు తీరుస్తారని ఎన్నుకుంటే ప్రజల పైన మరిన్ని భారాలు మోపుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి బలరాం విమర్శించారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో తాపీ పనివారు భవనంలో ఆదివారంసిపిఎంపార్టీ 25వమహాసభ నిర్వహించారు. ఆదివారంఈ మహాసభసూచికగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించుకుని అమరవీరులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ప్రారంభమైన మహాసభకు అధ్యక్షులుగా మంచిలి నీలకంఠం, బూడిద భువనేశ్వరి వ్యవహరించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలను కష్టాల నుండి బాధల నుండి గట్టికిస్తారు అనుకున్న ప్రజలపై ధరలు బారాలు విద్యుత్ బారాలు మోపుతున్నారు అన్నారు. మరొకపక్క కొత్త మద్యం పాలసీతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇసుక సమస్యతో నిర్మాణరంగం కుదేలైంది అన్నారు. అనంతరం సిపి ఎం పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మహాసభ నివేదికను ప్రవేశపెట్టారు.గత కాలంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాలు,సమీక్ష చేసుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునే విధంగా మహాసభలో చర్చించి తీర్మానాలను ఆమోదించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దరాజు,పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, నోములకొండ, పొగాకు నారాయణరావు, జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ,కోడి లక్ష్మణ్, కోరాడు బద్రి,గుత్తుల సాగర్,కవురు నరసింహస్వామి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం

### – కారు ఢీకొట్టిన బాలుడికి ఎమ్మెల్యే ఆర్థిక సహకారం



**ఏలూరు,మేజర్న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.స్థానిక పవర్ పేటలోని ఆదివారంఎమ్మెల్యే క్యాంపు కార్యాలయనికి తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్థానిక తంగెళ్ళమూడికి చెందిన కిలాపర్తి అశోక్ కుమార్,వెంకట దుర్గ దంపతుల కుమారుడు బాల షణ్ముఖ్ ను కారు ఢీకొట్టడంతో తలకు గాయమై నరాలు చిట్లి కోమాలోకి వెళ్ళిపోయాడు. విజయవాడలోకి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ పోషణే కష్టమైన తరుణంలో ఆసుపత్రి ఖర్చులు మరింత భారం కావడంతో షణ్ముఖ్ తల్లిదండ్రులు ఎమ్మెల్యే చంటిని కలిసి పరిస్థితిని వివరించారు. ఆపరేషన్‌కు 10 లక్షల వరకు అవసరమవుతుందని తెలిపారు. ఈ విషయంలో వారికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే చంటి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20వేల 500 రూపాయలను ఎమ్మెల్యే చంటి వారికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, ఆర్నేపల్లి తిరుపతి, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పదవుల రాకతో నర్సాపురం అభివృద్ధి

## 'దేశం' నేత కొవ్వలి నాయుడు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనకబడిన నర్సాపురం నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత నిచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారుగా ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడులకు అవకాశం ఇవ్వటం ద్వారా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజరామ్మోహన్ నాయుడు అన్నారు. వీరు ఇరువురికి పదవులు రావడంతో ఆదివారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడారు.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆనాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌తో బియ్యపు తిప్పలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేయిస్తే దానిని వేరొక చోటకు మార్చారని నాయుడు అన్నారు.ఇప్పటివరకు ఆ పనులు ప్రారంభం కాలేదన్నారు. విజ్జేశ్వరం నుండి నర్సాపురం వరకు తాగునీరు పైపులైను, వశిష్ట వారధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,తదితర పనులను గాలికి వదిలేసారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలోనూ, మూడు రాజధానుల విషయంలో శాసనమండలిలో బిల్లు పెట్టినప్పుడు యం ఏ షరీఫ్ అధికార వైసీపీ ఒత్తిడికి లొంగకుండా న్యాయబద్ధంగా వ్యవహరించారన్నారు.తెలుగుదేశం ఆవిర్భావ నుండి పార్టీ వెన్నంటి ఉన్న షరీఫ్‌కు క్యాబినెట్ హోదా కలిగిన పదవి రావటం ఆ పదవి ద్వారా నర్సాపురం అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందన్నారు.

జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కొత్తపల్లి సుబ్బారాయుడు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులవటం ఆ కార్పొరేషన్ ద్వారా కాపుల అభివృద్ధికి పాటుపడవచ్చు అని అన్నారు. నరసాపురానికి రెండు కీలకమైన పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిభ చాటుకున్న కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు

**కలిదిండి,మేజర్‌న్యూస్:** స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ గట్కా ఫైట్ టీంకి ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యార్థులు కళా ప్రతిభను చాటుకున్నారు.విజయవాడలో జరిగిన డిస్ట్రిక్ట్ స్టేట్ లెవెల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ గట్కా ఫైట్ స్టేట్ సెలక్షన్స్‌లో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వీరిలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి 20 మంది పాటిస్పేట్ చేయగా వారిలో 11 మంది కలిదిండి ఇంగ్లీష్ మీడియం వారు అవడం గమనార్హం. నేషనల్ సెలక్షన్స్‌లో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుంచి 11 మంది పాటిస్పేట్ చేశారు. నేషనల్ సెలక్షన్స్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి నలుగురికి గోల్డ్ మెడల్స్ సాధించారు.ఈ నేషనల్ సెలక్షన్స్ కలిగిన ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుండి ఇద్దరు ఢిల్లీకి సెలెక్ట్ అయ్యారు.




పాము జగదీష్ రాము. కొండేటి చంద్ర నాగ సాయి గణేష్. వీరు మరల డిసెంబర్ 2న ఢిల్లీలో జరగబోయే నేషనల్స్ పోటీలో స్కూల్ ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఢిల్లీలో జరగబోయే నేషనల్స్ ఉమ్మడి కృష్ణాజిల్లా తరుపున హై స్కూల్ లో పనిచేసే కర్రసాము మాస్టర్ అందుగల మధుబాబు నేషనల్ టీం కోచ్ గాను, కరసాము ఏపీ సెక్రటరీ సత్య శ్రీకాంత్ నేషనల్ టీంకి మేనేజర్‌గాను సెలెక్ట్ అయ్యారు.ఈ సందర్భంగా స్కూల్, కరస్పాండెంట్ సానా వెంకట రామారావు, మీనా సరస్వతి, ప్రిన్సిపాల్ జై పాండురంగారావు గెలిచిన విద్యార్థిని విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఎక్కడో మారుమూలలో ఉన్న కలిదిండిని ఢిల్లీ వరకు తీసుకువెళ్తున్న విద్యార్థిని విద్యార్థులుకు,స్కూల్ కోచ్ అయినా అందుగల మధు బాబుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ విజయం ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

# వృద్ధులతో స్వాభిమాన్ విద్యార్థుల దీపావళి వేడుకలు





**– ఆనందోత్సాహాల మధ్య నిర్వహించిన గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్**

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జీవన్ సంధ్య వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు చెన్నాత్రికళ నిర్వహణలో స్వాభిమాన్ ట్రిబుల్ ఎఫ్ విద్యార్థులతో,వృద్ధులతో ఆనందోత్సాహాల మధ్య జరిగింది.వృద్ధులతో కలిసి ఈవేడుకను నిర్వహించడం జరిగింది. కుటుంబానికి దూరంగా ఒంటరిగా ఉంటున్న వృద్ధులతో,స్వాభిమాన్ ట్రిబుల్ ఎఫ్ విద్యార్థులు కలసి ఎంతో సంతోషంగా ఈ వేడుక నిర్వహించి నట్లు, వృద్ధులు ఎంతో ఆనందం వ్యక్తం చేసి నట్లు ట్రస్టీ చెన్నా జనార్ధన్‌రావు తెలిపారు.అలాగే అందరూ పండుగలకి సంబంధించి కుటుంబ సభ్యులతో కలిసిఇక్కడికి వచ్చి వారితో కలిసి ఆనందంగాగడిపితే వారికి సంతోషం కలుగుతుందన్నారు. మనుమలు,మనవరాలు లేని లోటు లేకుండా వృద్ధులంతా కూడావారితో కలిసి సంతోషంగా గడిపారు. అలాగే విద్యార్థులు కూడా అమ్మమ్మ, నాన్నమ్మ,తాతయ్యలు లేని లోటు లేకుండా కేరింతలు కొడుతూఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా చేసుకున్నారని వివరించారు.

వాళ్ళ కళ్ళల్లో ఆనందం చూసిన తర్వాత ఎంతో సంతృప్తిగా ఉందని,ఈ సంతోషం వెలకట్టలేనిదని జనార్ధన్ రావు తెలిపారు వృద్ధాశ్రమ నిర్వాహకులు కేశవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు త్రికళకు,ఆర్గనైజేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సహకరించిన ట్రిబుల్ ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్స్ సీమ గోయింకా,ఓపి గోయింకాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మాజీ ఆనందరావు మాస్టారు, ప్రకాష్ లైన్ త్రిమూర్తులు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్‌కు ఆర్థిక చేయూతనందిస్తున్న దాతలకు జనార్ధన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## 24 గంటల పాటు శ్రీ సత్య సాయి అఖండ నామ సంకీర్తన



శ్రీ సత్య సాయి బాబా 99వ జన్మదిన పురస్కరించుకొని ఏలూరు సత్యసాయి సేవాసమితి వారి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి మందిరంలో శనివారం నుండి ఆదివారం రాత్రి 6 గంటల వరకు 24 గంటల పాటు అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసి సాయి బాబా వారి మహా మంగళ హారతిని జిల్లా ఆదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్ర రావు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కనుమిల్లి శశి శేఖర రావు ,కన్వీనర్ పైడేటి రామా రావు,జిల్లా కోఆర్డినేటర్స్ సోడిశెట్టి శాంత కుమార్. వై వెంకటేశ్వరరావు, కె వెంకటేశ్వరరావు,సూర్యనారాయణ, కుమార్,విశ్వనాథ్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 మంది అర్హులకు దుప్పట్లు స్వామివారి ప్రసాదాలు అందించారు.

## బెల్ట్ షాప్‌లో 6 మద్యం సీసాలు స్వాధీనం : కేసు నమోదు



అగిరిపల్లి,మేజర్‌న్యూస్: మండలపరిధి ఈదర గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న దొండపాటి ఆంజనేయులు అనే వ్యక్తి నుండి 6 మద్యం సీసాలను స్వాదినవరచుకొని, కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ నూజివీడు, ముసునూరు,ఆగిరిపల్లి,చాట్రాయి మండలంలోని మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి మనిషికి 3 మూడు మద్యం సీసాలు మించి ఇవ్వకూడదని,అదేవిధంగా 21 సంవత్సరం లోపు వారికి మద్యం విక్రయించకూడదని,ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలని అన్నారు.

మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులకు మద్యంను సరఫరా చేస్తే సహించేది లేదని, బెల్ట్‌షాపులకు అనుమతులు లేవని ,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఫోన్‌నెంబర్ (9440902462)కు సమాచారం తెలియజేసిన వెంటనే చర్యలు తీసుకుంటా మని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## రవి శంకర్ మహా సత్సంగం ఆహ్వాన బ్రోచర్ ఆవిష్కరణ



భీమవరం,మేజర్ న్యూస్: ప్రపంచ ఆధ్యాత్మిక గురువు పరమ పూజ్య గురుదేవ్ రవి శంకర్ గురూజీ ఆంధ్రప్రదేశ్ విజయవాడ వస్తున్న సందర్భంగా భీమవరం భీమేశ్వర స్వామి దేవస్థానంలో రవిశంకర్ శాఖ ప్రధాన శిష్యులు పతంజలి యోగ గురువులు కలిగొట్ల గోపాల శర్మ ఆవిష్కరించారు. ఈనెల 13న రవిశంకర్ గురూజీ ప్రపంచ పర్యటనలో భాగంగా విజయవాడ వస్తున్నారని, లక్షమంది శిష్యులతో యోగ నిర్వహించి దివ్య సందేశం అందిస్తారని, అందరూ రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు పున్నమి ఘాట్ భవానీ పురం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో చెరుకు వాడ రంగసాయి, వి రథకుమారి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, అల్లు శ్రీనివాస్, గాదిరాజు సాయి రాజు, శిరీష, జయ వాసుకి, డి నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి రీజనల్ చైర్మెన్ రెడ్డి అప్పల నాయుడుకీ అభినందనల వెల్లువ





**ఏలూరు,మేజర్‌స్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన పార్టీ నాయకులు పలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.ఈ క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడుకు ఎపిఎస్ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ పదవి కేటాయిస్తూ ప్రకటన రావడంతో జిల్లా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు.

పలువురు ప్రముఖులు రెడ్డి అప్పల నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకేలతో శుభాకాంక్షలు తెలియజేశారు.. ఏలూరులో తాను చేసిన సుదీర్ఘ పోరాటానికి ఫలితంగా ఎపి ఎస్ఆర్‌టిసి రీజనల్ చైర్మెన్‌గా నియమితులయ్యారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు,జనసేన రాష్ట్ర కార్యదర్శి దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన పార్టీ మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర వైస్ చైర్మన్ మోరు వెంకటనాగరాజు,జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నిమ్మల జ్యోతి కుమార్,ఉమ్మడి ప.గో.జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి,సంయుక్త కార్యదర్శులు ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా,ముత్యాల రాజేష్, కలపాల ప్రేమ్ కుమార్,జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాష్ట్ర సభ్యులు మేడిచర్ల కృష్ణ,పెదవేగి మండల జనసేన నాయకులు జిజ్జువరపు సురేష్,మొరవనేని వంశీ, ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు, ఆర్‌టిసి ఏలూరు డిపో కమిటీ సభ్యులు,వివిధ డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ కోసం అవగాహన కల్పించిన పోలీసులు





**ఏలూరు,మేజర్‌స్యూస్:** జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక దళం ఆదివారం జిల్లా వ్యాప్తంగా మహిళలు,చిన్నారుల రక్షణ, వారి భద్రతే మా ప్రధాన ధ్యేయంగా విధి నిర్వహించారు.

నేడు సమాజంలో మహిళలు, విద్యార్థినులు,చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, ఈవ్ టీజింగ్,ఇతర నేరాలు నుంచి రక్షణ కల్పించి వారికి సత్వర న్యాయం అందించేందుకు ఏలూరులో అభయ మహిళా రక్షక మహిళ పోలీసు సిబ్బంది పలు ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. బాలికలపై జరిగే నేరాలు తగ్గించడానికి, మహిళల రక్షణ కొరకు మహిళా పోలీస్ సిబ్బంది పార్క్ లు, బస్టాండ్లు, రైల్వే స్టేషను,పబ్లిక్ ప్లేసెస్‌లో గస్తీ తిరుగుతూ 112టోల్‌ఫ్రీ నెంబరు,వాట్సాప్ నెంబర్ 9550351100 ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే 10 నిమిషాలలో అభయ మహిళా రక్షక దళం సంఘటనా స్థలానికి చేరుకొని అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని ప్రజలకు భరోసా కల్పించినట్లు అభయ మహిళా రక్షక దళ సభ్యులు తెలిపారు.

# విద్యుత్ ట్రూ అప్ చార్జీలు వెనక్కి తీసుకోవాలి : సిపిఎం



**ఏలూరు,మేజర్ స్యూస్:** సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్రలో భాగంగా ఏలూరు నగరంలోని పడమర వీధి, సుబ్రహ్మణ్యం కాలనీ ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం ప్రచార యాత్ర జరిగింది.నాయకులు పి.కిషోర్, వైయస్ కనకారావు మాట్లాడుతూ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కరెంటు ట్రూ అప్ చార్జీలను విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ టిడిపి, జనసేన బాదుడే బాదుడు అంటూ నినదించిన విషయాన్ని చంద్రబాబు మరిచిపోయారా? అంటూ ఎద్దేవా చేశారు. పప్పు, ఉప్పు మంచి నునె ధరలు ఆకాశాన్ని అంటుతున్న, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయకుండా 99 రూపాయలకే మద్యం అందిస్తున్నామని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. ఏలూరు నగరంలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని వీధిలైట్లు వెలగడం లేదని డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉన్నదని విమర్శించారు. ఏలూరు నగరంలో ప్రజలకు మంచినీళ్ల సౌకర్యం కూడా కల్పించలేని దుస్థితిలో నగరపాలక సంస్థ ఉందని మున్సిపల్ కుళాయిలలో మురికి నీళ్లు వస్తున్నాయని, నగర ప్రజలు అనేక రకాల విష జ్వరాలతో విలవిలాడుతున్నారని విమర్శించారు. యాత్రలో మహిళా సంఘం నాయకులు శారద, హైమావతి, సిహెచ్ అన్నవరం, ఎం శ్రీనివాసరావు,డి దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు పేకాట రాయుళ్ల పై కేసు నమోదు



**పెదపాడు,మేజర్ స్యూస్:** ఇన్చార్జి ఎస్ఐ కట్టా శారద సతీష్‌కి రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెంకటాపురం గ్రామములో పేకాట శిబిరముపై దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి రూ. 6వేల నగదు స్వాధీనం కేసు నమోదు ఎస్ఐ తెలిపారు.

## ఇళ్ల స్థలాల కొరకు వ్యక్తిగత అర్జీల సమర్పణ



పెంటపాడు,మేజర్ న్యూస్: పెంటపాడు గ్రామ ప్రజలకు గత వైసిపి ప్రభుత్వం హయాంలో కేటాయించిన 523 మందికి,అర్హులైన ప్రతి పేదవారికి తక్షణమే పెంటపాడు, పరిసర గ్రామాలలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల18న ఇళ్ల స్థలాల కొరకు గ్రామ సచివాలయాల వద్ద వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమం లో భాగంగా ఆదివారం పెంటపాడు గ్రామంలోని బీసీ కాలనీ నందు ఇళ్ల స్థలాల లబ్ధిదారుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి కరపత్రాలు అందించి, లబ్ధిదారులు,స్థలాలు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాల దరఖాస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పెంటపాడు ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తారని ఎదురుచూపులు చూసారు. ఎన్నికల హామీల మేరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, ఇంటి నిర్మాణం కొరకు రూ. 5 లక్షలు తక్షణమే అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొనతాల నాగరాజు, నల్లమిల్లి ఫణి శ్రీనివాస్ రెడ్డి, బీసీ కాలనీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఏఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన



**ఏలూరు,మేజర్ స్యూస్:** స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కార్తీక మాస వన సమారాధన ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారా శేషు మాట్లాడుతూ ఆత్మీయతను పంచే కార్తీక వనభోజనాలు మంచి ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది అన్నారు. అధ్యక్షులు ఎస్ఎం అక్బర్ మాట్లాడుతూ పరమ పవిత్రమైన కార్తీక మాసంలో వన భోజనాలు చాలా విశిష్టత ఉందని,ఆరోగ్యం వన భోజనాల్లో ఇమిడి ఉందని,పురాణాల్లో కూడా దీని ప్రస్తావన ఉందని అన్నారు. ఎన్.జగదీష్ మాట్లాడుతూ ధనిక పేద వర్గాల తారతమ్యం లేకుండా అందరూ కలసి పచ్చని వనాల మధ్యన సహపంక్తి భోజనాలు చేయడం ద్వారా మానవ సంబంధాలు బలపడతాయని అన్నారు. ఈ సందర్భంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి సహాయ సహకారాలు అందించిన గొంతిన రామకృష్ణకి, పలువురికి బొకేలతో, దుస్సాల్వతో, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి విగ్నేష్, విశ్వనాథ మాధవరావు, ఎస్కే సత్తార్,జల్లా వీరభద్రరావు,జంపా సూర్యనారాయణ,జి ఎ లారీ గుప్తా,నజీర్,ఏ.అస్లాం, బురిడీ శ్రీనివాస్ ఫ్రెండ్ సర్కిల్,మహిళ వాకర్స్ కర్రీ అరుణ,మేరీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.